

# రాలిపోని నిన్న

లిం. గోపీచంద్



దూరంగా నదీ, ఆకాశం కలిసిన చోట చీకటి నదిలోకి జాలరి విసిరిన వలలా కమ్ముకొస్తోంది.

అతను గట్టు మీద నిలబడి చూశాడు. ఆయాసంతో హృదయం వేగంగా కొట్టుకుంటోంది.

నుదిటి మీద స్వేద బిందువులు కాలంలా మౌనంగా క్రిందికి రాలిపోయాయి.

ఆలస్యంగా గమ్యస్థానానికి చేరుకున్న అతన్ని ఏటిగాలి పలుకరించింది.

అతడు ఆశగా చూశాడు.

దూరంగా నది మధ్య మెలికలు తిరుగుతూ సాగిపోతూ వుంది పడవ.

పడవ నడిపే వ్యక్తి పాడుతోన్న పాట సర్వవ్యాప్తమై ప్రవహించి ప్రకృతి పులకరించినట్లు ప్రతి ధ్వనిస్తోంది.

అతడు వేగంగా వచ్చే శ్వాసను ఆపుకుంటూ అలాగే చూస్తూ నిలబడిపోయాడు.

ఆశ నిండిన నిమిషాలు కరిగి క్షణాలయ్యాయి. కాలంతో కలసిన చీకటి ఎదలోపలి బాధలా పేరుకుంటోంది.

అతడి నిరాశ నిండిన చూపులకు దూరంగా కదిలిపోతున్న పడవ చివర చీర కొసలు కనిపించాయి.

అతడి గుండెలాగా అది కూడా రెపరెప లాడుతోంది.

క్రమక్రమంగా పడవ మాయమైంది.

అతడు వెనక్కి తిరిగాడు.

* * * *

తూరుపు తెల్లదనం గదిలోకి వచ్చి పడుతోంది.

రగ్గులోంచి బయటకు వచ్చిన కళ్ళకు ఎదురుగా టేబుల్ మీద కుంకుమ రంగులో ఉన్న గులాబిపూలు గుత్తులు కనిపించాయి.

"గుడ్ మార్నింగ్"

తలతిప్పి చూశాడు విశ్వనాథ్.

ఒక చల్లని రేయి మంచులో తడిసిన మల్లెపువ్వులా మనోహరంగా ఉంది అమిత నవ్విన నవ్వు.

పట్టుకు ఆటపట్టుల్లా ఉన్న ఆమె నల్లని కనురెప్పలు పుష్పబాణుని శరాసనాల్లా వంపుదీరి వికసిస్తోన్న పూరేకుల్లా ఉన్నాయి.

"గుడ్ మార్నింగ్" చెప్పాడు విశ్వనాథ్.

అమిత వంగి టేబుల్ మీది గులాబీలు అందుకుంది.

"రాత్రి జరిగిన గొడవ నేను పూర్తిగా మర్చిపోయాను." విశ్వనాథ్ చెప్పాడు.

వంగి పూలను తీసుకుంటూన్న అమిత మెల్లగా పైకి లేచింది. నిగనిగలాడే శిరోజాలు, ఒక్కసారిగా కదిలి ఆమె ముఖసరోజాన్ని పరివేష్టించి ఇక అక్కడ ఆగిపోయి దాని రూపురేఖ విలాసాలను కీర్తింవసాగాయి.

ఆ ఎర్రని పూల మధ్యలోని మొగ్గలు ఆమె ముడుచుకున్న పెదాల రంగులో కలసిపోయాయి.

అమిత ఏ సమాధానం చెప్పలేదు. క్రితం రాత్రి జరిగిన గొడవ తనూ మర్చిపోయినట్లు చెప్పాలని ఉన్నా పెదవి విప్పి చెప్పలేక పోయింది.

విశ్వనాథ్ పరదాలు లాగి తోటలోకి చూస్తూ "నువ్వు నన్ను సరిగ్గా అర్థం చేసుకోవటం లేదు అమిత" అన్నాడు.

"అదే ప్రశ్న నేనూ అంటున్నాను." అమితపూలను

చిన్ని ఇత్తడి గిన్నెలో సర్దుతూ.

విశ్వనాథ్ నవ్వాడు. "సరే మనిద్దరం ఒకరిని ఒకరు అర్థం చేసుకోవటం లేదు. ఇలా ప్రతి చిన్న విషయానికీ గొడవ పడటం చూస్తే చాలా చిరాగ్గా ఉంది."

అమిత చెప్పింది "భార్యా భర్తలలో ఇద్దరూ తెలివైన వాళ్ళయినా, లేదా తెలివి తక్కువ వాళ్ళయినా గొడవలేవీ రావట. ఒకరు తెలివి గలవాళ్ళయి, ఒకరు తెలివి తక్కువ వారయితేనే గొడవలు వస్తాయిని మా తాతయ్య చెప్పేవారు."

విశ్వనాథ్ వెనక్కి తిరిగి "మైగాడ్! మనిద్దరిలో తెలివితక్కువ వాళ్ళు ఎవరై ఉంటారు?" అడిగాను.

"నేను చెప్పను." అమిత నవ్వింది.

విశ్వనాథ్ ఒక్కంగలో ఆమెకేసి నడిచాడు.

అమిత చురుకుగా కదిలి అతనికి అందకుండా దూరంగా జరిగింది.

అలా ఓ రాత్రి జరిగిన గొడవ మాసిపోయింది. ఇలాటి గొడవలు ఎన్నో వచ్చిపోతూనే ఉన్నాయి. అసలెందుకు ఈ విధంగా జీవితాన్ని వృధా చేసుకుంటున్నారో తెలిసే రోజు వచ్చింది. కానీ ఆ రోజు నుంచే వారిద్దరూ దూరమయ్యారు.

* * * * *

దాదాపు గంట నుంచి ఎదురు చూస్తూనే ఉంది. విశ్వనాథ్ చెప్పిన టైంకి రాలేదు.

ఈ చిన్న ఊరికి ఉద్యోగనిమిత్తం బదిలీ అయివచ్చాక



నెల్లూరు అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక కో-ఆపరేటివ్ బ్యాంకి ఆవరణలో జానపద నృత్యం ప్రదర్శించిన నృత్య కళారత్న మద్దాలి అపర్ణ

ఆమెకు కాలం గడవటం కష్టంగా ఉంది. తమ ఇంట్లో ఇన్ని వసతులు ఉన్నా బయట మాత్రం పూర్తిగా పల్లెటూరు.

అతను రానందుకు ఆమెకు కోపం లేదు. ఇలాంటి రోజులు ఎన్నో ఆమె నిరాశగా, ఒంటరిగానే గడిపింది.

అందుకే కోపానికి కావలసిన శక్తిని కోల్పోయింది.

కనీసం ఫోన్ చేసి 'నేను రావటం లేదనో, లేటవుతుందనో చెబితే తను ఏదో ఒకటి చేసుకునేది.

అమితకు ప్రొద్దున విశ్వనాథ్ చెప్పిన మాటలు ఇంకా చెవుల్లో వినిపిస్తూనే ఉన్నాయి.

"నీ పుట్టినరోజు సాయంత్రం మనం ఇంట్లో గడపడం ఏం బాగోలేదు. హోటల్‌కి వెళదాం. ఏం వెయ్యొద్దు నేను సరిగ్గా ఆరున్నరికి వచ్చేస్తాను. సరేనా?"

ఆ ఆరున్నర దాటి మూడుగంటలైంది.

అతని కోరిక ప్రకారం ఏం వండలేదు కాబట్టి ఏమీ. ఇంత వరకు తినలేదు. పెళ్ళి కాకముందు పుట్టినరోజు గుర్తుకొచ్చింది.

అమిత లేచి టేప్ రికార్డ్ ఆన్‌చేసి వెళ్ళి మంచం మీద పడుకుంది.

దాదాపు పావుగంట దాకా పాటలు వింటూ గడిపింది.

కానీ ఆమెకామాత్రం ఓర్పుకూడా లభించ లేదు. కరెంట్ పోయింది.

గాఢమైన చీకటి ఇంటిలో చోటు చేసుకుంది.

ఆ చీకటిని చెదరగొట్టే ప్రయత్నం అమిత చెయ్యలేదు. కళ్ళు తెరిచి చీకటిని పరికించి చూస్తూనే ఉంది.

చీకటికి ఆప్త బంధువు నిశ్శబ్దం కూడా తోడైంది.

ఆలోచనలు అలసిపోయే వేళ విశ్వనాథ్ ఇంటికి వచ్చాడు.

చీకటి పొరలను తడుముకుంటూ "సారీ డార్లింగ్!




పైన కార్టూన్‌లో నటీనటులు ఎవరు? ఏ చిత్రంలో అన్నది కార్డుపై వ్రాసి [illegible]ండి. ప్రియమైన బహు[illegible] గెలుచుకోండి!
MARUTI, 6, SARAVAN St., MADRAS-600 017.

అనుకోకుండా పాత మిత్రుడు వచ్చాడు. వాడిని వదిలి రావడం కష్టమైంది." చెప్పాడు.

"పర్వలేదు." అమిత చెప్పింది.

"ఇలా చీకటిలో కూర్చున్నావే?" అడిగాడు.

"కరెంట్ లేదు."

"కొవ్వత్తులు వెలిగించకపోయావా?"

"వెలుగు కన్నా ఈ చీకటే బాగుంది."

అతడే లేచి కొవ్వత్తులు వెదికి వెలిగించాడు.

నారింజ రంగు కాంతి మెల్లగా నాలుగు వైపులకు చోటు చేసుకుంది.

ఆ వెలుగులో విశ్వనాథ్ అమిత మొఖంలోకి చూశాడు.

"నేను తొందరగా వచ్చేద్దామని ఎంతో ప్రయత్నించాను కూడా" చెప్పాడు విశ్వనాథ్.

"ఫోన్ చేసి చెప్తావనుకున్నాను." అమిత కంఠంలో బాధకనిపించింది.

"సారీ నాకు ఫోన్ సంగతి గుర్తుకు రాలేదు."

అమిత తల ఒక్కసారిగా పైకి లేచింది. "ఇంకెప్పుడూ సారీ చెప్పకు విశ్వనాథ్! విని విని విసుగుపుడుతోంది." అంది.

విశ్వనాథ్ నవ్వాడు. "క్షమించు డార్లింగ్."

అమిత ఆ గదిలోంచి వెళ్ళిపోయింది.

విశ్వనాథ్ ఆమె భుజం గట్టిగా పట్టుకుని ఆపాడు.

అతని ప్రయత్నంతో ఆమె అతనికి మెల్లమెల్లగా చేరువైంది.

"ఇంకోసారి ఇలా జరిగితే ఫోన్ చేసే చెబుతాను."

అమిత తల ఎత్తి చూడలేదు.

విశ్వనాథ్ మరింత దగ్గరగా లాక్కుంటూ "ఆకలి వేస్తోంది." చెప్పాడు.

"నేను ఏమీ చేయలేదు." అమిత కంఠంలో కరుకుదనంతో కూడిన వణుకు చోటు చేసుకుంది.

"ఓహ్! మర్చిపోయాను. నేనే ఏమీ వెయ్యొద్దన్నాను కదూ! నిజంగా నేను దుర్మార్గుడినే. ఇంతవరకు నువ్వు ఏమీ తినలేదా? ఏదన్నా చేసుకుంటే పోయేదిగా?"

"వదులు" అమిత అడిగింది.

విశ్వనాథ్ వదికినట్లే వదిలి మరింతగా హత్తుకుంటూ ఆమె మొఖాన్ని ఎత్తి చూశాడు.

రెండు వాడిగా ఉన్న మరకత్తులు గురి చూసి వదిలినట్లుగా అనిపించింది. విశ్వనాథ్ అమితను వదిలేశాడు.

రోషకషాయిత నేత్రాలతో చెప్పింది. అమిత "నాకు... నాకు ఈ జీవితం నచ్చలేదు. నేనిక్కడ ఉండలేను."

"కమాన్ అమితా! సిల్లీగా మాట్లాడకు. ఇంత చిన్ని చిన్ని విషయాలకు ఎందుకిలా ఫీల్ అవుతావు? ఇలాంటి డిప్రెషన్స్ అంతమంచిది కాదు." విశ్వనాథ్ అనునయంగా అన్నాడు.

"నాది డిప్రెషన్ కాదు. విసుగు, విరక్తి." కోపంగా అంది అమిత.

"సరే జరిగిపోయిన దానికి ఏం చెయ్యమంటావు?" విశ్వనాథ్ విరాగ్గా అన్నాడు.

అతని చిరాకును చూసిన అమిత హృదయం మరింతగా కృంగిపోయింది. "ఫలాన విధంగా చెయ్యమని చెప్పడానికి నాకిక్కడ ఏ విధంగాను హక్కులేదు." అంది.

విశ్వనాథ్ ఏం మాట్లాడలేదు. అతడు లోపలకు వెళ్ళిపోయాడు.

దాదాపు గంట తర్వాత వచ్చి చూశాడు.

అమిత అక్కడ లేదు.

* * * *

ఆరు నెలలు గడిచిపోయాయి.

విశ్వనాథ్ అదే ఊళ్ళో ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు. ఇన్ని రోజుల్లో అతని జీవితగమనంలో పెద్ద మార్పేమీ లేదు

అమిత వెళ్ళి పోయి ఇన్ని రోజుల్లో అతడు ఆమె గురించి ఎక్కువ ఆలోచించలేదు.

కానీ అతడు గమనించకుండానే అమిత ఇంటిలోని ప్రతి ప్రదేశంలో అతనికి కనిపిస్తూనే ఉంది. తన అంతరంగంలో ఆమె అమూల్యమైన రూపురేఖలు చెరిపి వేయలేని ముద్ర వేసుకున్నాయి.

ఆ రోజు అమిత రాసిన ఉత్తరం చదివాక అనిపించింది. అతడింత కాలం ఆమెను వదిలి ఎలా ఉండగలిగాడని ఆ రోజు సాయంత్రం ఎప్పటిలా నదిమీదకు వాలుతోంది.

చీకటి చిరుసిగ్గుతో మేలి ముసుగు సరి చేసుకోసాగింది.

చిన్నలో వికసించిన పువ్వు రాలబోయింది. కొమ్మ తల్లి చాచిన హస్తాలు శూన్యమయ్యాయి.

దూరంగా పడవ వస్తూ ఉంది.

మసక మసక వెలుతురులో అర్థం కాని ఆరాధన ఏదో ఉంది. అందుకే మనసు పదే పదే దానినే కోరుకుంటుంది.

పడవ వచ్చి ఒడ్డున ఆగింది.

విశాలమైన నేత్రాలలో ఎనలేని భావాలన్నీ అతడు చదవగలిగాడు.

విశ్వనాథ్ చేయి అందించాడు.

అమిత అందుకుంది.

సుతి మెత్తని పాదం పడవలోంచి గట్టుకు చేరింది. కానీ పాదానికి ఉన్న మువ్వలు పడవ మేకుకు తగులుకున్నాయి.

అమిత కాలు విదిలించింది.

వెండి మువ్వలు తెగి మధురమైన శబ్దంతో జలజలమంటూ ఒడ్డున రాలి పడ్డాయి.

విశ్వనాథ్ వంగి ఒక్కటి కూడా పోకుండా ఏరాడు.

అమిత చాలా రోజుల తరువాత అతని మొఖంలోకి సూటిగా చూసింది.

మువ్వలు ఆమె దోసిలిలో పోసాడు విశ్వనాథ్.

వారెక్కిన ఎడ్లబండి ఇంటి వైపు సాగిపోతోంది.

బండిలో ఒదిగి కూర్చున్న అమిత మొఖం మీదకు లాంతరు వెలుగులు సూటిగా వచ్చి పడుతున్నాయి.

నారింజరంగులో ఆమె మొఖం వెలిగిపోతోంది.

కనురెప్పలు ఎత్తి విశ్వనాథ్ కేసి చూసింది.

విశ్వనాథ్ నవ్వాడు.

"నేను... నేను ఒక ప్రశ్న అడుగనా?" అమిత అడిగింది.

విశ్వనాథ్ కళ్ళతోనే చెప్పాడు.

"ఈ ... ఈ తప్పంతా నాదేనా;" అమిత కనురెప్పలు తడిసి తడిసి భారమయ్యాయి.

విశ్వనాథ్ చెప్పాడు "సగం నీది. సగం నాది. మొత్తం కలిసి మనిద్దరిది."

అమిత వంగి విశ్వనాథ్ పెదవులపై తన పెదవులతో నిమిషం సేపు మరచిపోలేని జ్ఞాపకాన్ని కలుగచేస్తూ అన్నది " ఐ లైక్ యు."

ఎడ్లబండి ముందుకు సాగింది.



ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన శ్రీ ఎ.ఆర్. కృష్ణ షష్టిపూర్తి ఉత్సవాలలో భాగంగా శ్రీ కృష్ణ దర్శకత్వంలో ప్రదర్శితమైన మూడువందల యేళ్ళనాటి తంజావూరు యక్షగానం 'సతిదాన శూరం' (క్రీస్తుశకం 1700లో షహజీ మహారాజు వ్రాసినది) నుంచి ఒక దృశ్యం